క్లుప్తంగా

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా జగదీష్



చిలుకూరు : చిలుకూరు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా మండల పంచాయతీ అధికారి జగదీష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా పని చేస్తున్న గిరిబాబు అనారోగ్య సమస్యలతో సెలవుల్లో ఉండడంతో ఎంపీఓగా పని చేస్తున్న జగదీష్‌కు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

దివ్యాంగుల కేంద్రానికి రూ.లక్ష విరాళం

కోదాడరూరల్ : కోదాడ మండల పరిధిలోని అశోక్‌నగర్‌లో గల శనగల రాధాకృష్ణ దివ్యాంగుల అనాథ ఆశ్రమానికి పట్టణానికి చెందిన వీరేపల్లి వెంకట సుబ్బారావు తన సతీమణి రుక్మిణమ్మ జ్ఞాపకార్థం గురువారం నిర్వాహకులకు రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వెంకట సుబ్బారావు మాట్లాడుతూ.. మానసిక దివ్యాంగులను చేరదీసి వారికి ఆశ్రయం కల్పించడం గొప్ప విషయమని అన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి రూ.10,116 అందజేత

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీకోదండ రామస్వామి ఆలయానికి అనుబంధంగా చేపట్టిన కల్యాణ మండపం నిర్మాణానికి నడిగూడెంకు చెందిన రిటైర్డు వ్యాయామ ఉపాధ్యాయుడు గుండు అనంతరాములు, సరస్వతి దంపతులు గురువారం ఆలయ కమిటీ సభ్యులకు రూ.10,116 అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ భవురిశెట్టి వెంకటరత్నం, కార్యదర్శి కొండా వెంకన్న, కోశాధికారి వందనపు సూర్యప్రకాశరావు, దయాకర్, పాల్గొన్నారు.

డీఎస్ నకార విగ్రహం ఏర్పాటుకు హామీ

హుజూర్‌నగర్ : పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్న ప్రభుత్వ పెన్షనర్ల పితామహుడు డీఎస్ నకార విగ్రహానికి కావాల్సిన మొత్తం రూ.35వేలను పట్టణానికి చెందిన రిటైర్డు ఉపాధ్యాయురాలు బెల్లకొండ రామలక్ష్మి విరాళంగా ఇవ్వనున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నా సోమయ్య, కొప్పుల వీరారెడ్డి గురువారం తెలిపారు. రామలక్ష్మి తన తల్లిదండ్రులు బెల్లంకొండ గురువమ్మ, గురవయ్య జ్ఞాపకార్థం విరాళం ఇస్తున్నట్లు తెలిపారు. ఈనెల చివరి వారంలో నకార విగ్రహం ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.

ఆలయానికి వెండి వస్తువులు బహూకరణ



హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాల స్వామి దేవాలయంలో గల శ్రీగోదాదేవి అమ్మవారికి వెండి వస్తువులను దాతలు గురువారం బహూకరించారు. రూ.17, 400 విలువ గల 174 గ్రాముల వెండి కడియాలు, జడను దాతలు మునగాల వెంకటేశ్వర్లు- రత్నకుమారి దంపతులు ఆలయ ఈఓకు అందజేసినట్లు అర్చకులు ముందుంబై హరీష్‌కుమార్‌చార్యులు తెలిపారు.

కిషన్‌నాయక్‌కు సన్మానం



ఏజీపీ కిషన్‌నాయక్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మఠంపల్లి : హైకోర్టు ఏజీపీ, మండలంలోని పాతదొనబండతండాకు చెందిన భూక్యా కిషన్ నాయక్‌కు హోం అండ్ పోలీస్ సర్వీసెస్‌లో పదోన్నతి లభించిన సందర్భంగా గురువారం స్థానికంగా కాంగ్రెస్ పార్టీ మండల ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా మంజీనాయక్, డీసీసీ ఎస్టీ సెల్ మాజీ అధ్యక్షుడు నవీన్‌నాయక్, టీపీసీసీ అధికార ప్రతినిధి బానోతు భాస్కర్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ పెదవీడు గ్రామ అధ్యక్షుడు షేక్ ఖరీమ్, నాగచైతన్య, సుమన్, నాగరాజు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌కు సత్కారం



బషీర్‌ను సన్మానిస్తున్న నాయకులు

కోదాడరూరల్ : కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమితులైన షేక్.బషీర్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకుడు, 20వ వార్డు ఇన్‌చార్జ్ కాంపాటి శ్రీను ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కుడుముల లక్ష్మీనారాయణ, కాంపాటి పుల్లయ్య, ముస్తఫ, విజయ్, రమేష్ ఉన్నారు.

ఇన్‌చార్జ్ కార్యదర్శిగా కవిత

చిలుకూరు : మండలంలోని సీతారాంపురం గ్రామ పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శిగా నారాయణపురం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న కవితకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు గురువారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ గ్రామ కార్యదర్శిగా పని చేసిన అవినాష్‌రెడ్డిని డీపీఓ కార్యాలయానికి అటాచ్ చేశారు.

నెరవేరని పేదోడి సొంతింటి కల

- అసంపూర్తిగా డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం
- నిధులు రాకపోవడంతో పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన భవనం



మునగాలలో అసంపూర్తిగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు

మునగాల : డబుల్ బెడ్ రూం ఇళ్లు మునగాల గ్రామ ప్రజలకు అందని ద్రాక్షలా మారాయి. ప్రభుత్వాలు మారుతున్నా పేదోడికి సొంతింటి కల కలగానే మిగులుతోంది. మూడేళ్ల క్రితం నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం మునగాల గ్రామానికి 60 డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. జీ ప్లస్ త్రీ పద్ధతిలో సమీకృత అపార్ట్‌మెంట్‌గా నిర్మించాలని ప్రణాళిక రూపొందించింది. నాటి జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి వెంటనే ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. తొలుత డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పనులను కాంట్రాక్టర్ మొదటి దశ వేగవంతంగా పూర్తిచేశారు. కానీ ప్రభుత్వం నుంచి నిధుల విడుదల ఆలస్యం కావడంతో రెండో దశ నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఇలా కొన్ని ఇళ్లను నిర్మించి బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్ ప్లాస్టింగ్ చేయకుండా అసంపూర్తిగా నిలిపివేశారు. దీంతో నేడు అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. చెత్తాచెదారం, పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిలిచిపోయిన డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పనులు తిరిగి ప్రారంభించి పూర్తి చేయాలని పేద వర్గాలు, ప్రజాసంఘాలు, ప్రతిపక్ష పార్టీలు కోరుతున్నాయి.

ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలి



“ మండల కేంద్రంలో అసంపూర్తిగా నిలిచిపోయిన డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణానికి అసవరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేయాలి. నిర్మాణ పనులను పూర్తి చేసి అర్హులకు పంపిణీ చేయాలి. లేనియెడల బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తాం.

– చింతకాయల నాగరాజు, బీసీ సంక్షేమ సంఘం మండల శాఖ అధ్యక్షుడు, మునగాల

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా

“ కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు రాకపోవడంతో ఇళ్ల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయిన మాట వాస్తవమే. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లా. నిధులు మంజూరైన వెంటనే పనులను ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటాం.

– వసంత, పీఆర్ ఏఈ, మునగాల

వైభవంగా గోదారంగనాయకస్వామి పవళింపు సేవ



పవళింపు సేవలో పూజారులు, భక్తులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గురువారం శ్రీగోదాదేవి రంగనాయకస్వామి వార్ల పవళింపు సేవ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వివిధ పూలతో సుందరంగా అలంకరించిన ఊయలలో స్వామి, అమ్మ వార్లను ఉంచి పవళింపు సేవా మహోత్సవాన్ని నేత్రపర్వంగా జరిపారు. మహిళలు ఆలపించిన అన్నమాచార్య కీర్తనలు, జోలపాటలు, లాలి పాటలు భక్తులకు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పూజారులు, పాలక మండలి, భక్తులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



న్యూఇయర్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు, డిప్యూటీ సీఈఓ

మునగాల : తెలంగాణ స్టేట్ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ (టాస్కా) సూర్యాపేట జిల్లా ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం మండలంలోని మాధవరంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు, జెడ్పీ డిప్యూటీ సీఈఓ బి.శిరీష ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆరె.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్స్ సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలయ్యేలా అధికారులు కృషిచేయాలని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, తహసీల్దార్ వి.ఆంజనేయులు, ఏఓ బి.రాజు, ఎంపీఎస్ఓ సంపత్, ఏఈఓ భవాని, పంచాయతీ కార్యదర్శి అక్షిత తదితరులు పాల్గొన్నారు.

అర్చకుల క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రధాన అర్చకులు



క్రికెట్ పోటీలో తలపడుతున్న అర్చకులు

మఠంపల్లి : ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రం పరిధిలో గల ఎన్‌సీఎల్ స్కూల్ గ్రౌండ్‌లో తెలుగు రాష్ట్రాల స్థాయి తెలంగాణ వైఖానస ప్రీమియర్ లీగ్ టీ–10 క్రికెట్ పోటీలను గురువారం మట్టపల్లి ఆలయ ప్రధాన అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు, కృష్ణమాచార్యులు, రామాచార్యులు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఈ పోటీలలో హైదరాబాద్, ఖమ్మం, తిరుపతి, మట్టపల్లి, కోదాడ, హుజూర్‌నగర్‌లకు చెందిన అర్చకులు ఆరు జట్లుగా లీగ్ పద్ధతిలో మూడురోజుల పాటు పోటీలలో తలపడనున్నాయని తెలిపారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు షీల్డ్‌లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. లీగ్ పద్ధతిలో ఒక్కొక్క జట్టు మిగిలిన ఐదు జట్లతో తలపడాల్సి ఉంటుందని తెలిపారు. కాగా, మొదటిరోజు తొలి మ్యాచ్‌లో గౌతమస్ అండ్ భృగువారియర్స్ జట్లు తలపడగా గౌతమస్ జట్టు విజయం సాధించింది. రెండవ రౌండ్‌లో హంటర్స్ అండ్ ద్వారకా వారియర్స్ పోటీపడగా ద్వారకా వారియర్స్ గెలుపొందారు. మూడవ రౌండ్‌లో విఖనస రైజర్స్ అండ్ భృగు వారియర్స్ తలపడగా విఖనస వారియర్స్ విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో బొర్రా వెంకటవాసుదేవాచార్యులు, తూమాటి రామాచార్యులు, అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, విఖనస ప్రీమియర్ పరిషత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

- కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి



శ్రీకృష్ణ హోమ్స్‌లో సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

మునగాల : నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలది కీలక పాత్ర అని కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నర్సింహాపురం గ్రామంలో 65వ నంబర్ జాతీయ రహదారి పక్కన గల శ్రీకృష్ణ హోమ్స్ కాలనీలో రూ.రెండు లక్షల వ్యయంతో కాలనీవాసులు ఏర్పాటు చేసిన 14 సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతిఒక్కరూ తమ ఇళ్లు, వ్యాపార సంస్థల ముందు, కాలనీలలో తమ రక్షణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ హోమ్స్ కాలనీవాసులను డీఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఎస్పీ కాలువ కమిటీ మాజీ చైర్మన్ చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, కోదాడ మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, ఎస్ఐ బి.ప్రవీణ్‌కుమార్, శ్రీకృష్ణ హోమ్స్ కాలనీ అధ్యక్షుడు విలాసకవి రమేష్‌రాజు, సభ్యులు కత్తి వెంకటేశ్వర్లు, సత్తార్, రాయపరెడ్డి, శ్రీరామ్ భాస్కర్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



మాట్లాడుతున్న సైబర్ క్రైమ్ డీఎస్పీ శ్రీనివాసరావు

నడిగూడెం : సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలంలోని వల్లాపురంలో జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సైబర్, క్రిప్టో కాయిన్, బినాన్స్ ట్రేడింగ్ మోసాలకు గురికావద్దన్నారు. బ్యాంకు ఖాతా, ఏటీఎం కార్డు, ఓటీపీ వివరాలు ఇతరులకు చెప్పవద్దన్నారు. కార్యక్రమంలో మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, సైబర్ క్రైమ్ సీఐ లక్ష్మీనారాయణరెడ్డి, స్థానిక ఎస్ఐ జి.అజయ్‌కుమార్, కానిస్టేబుల్ మహేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మునగాల : మండలంలోని నర్సింహులగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999 – 2003 విద్యా సంవత్సరాల్లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు గురువారం గ్రామంలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. రెండు దశాబ్దాల తర్వాత ఒకచోట చేరిన స్నేహితులు ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకుని, నాటి తీపి గుర్తులను జ్ఞాపకం చేసుకున్నారు. తమకు విద్యనేర్పిన గురువులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గరిడేపల్లి : మండలంలోని కల్మలచెరువు గ్రామంలో రోడ్డు వెడల్పులో భాగంగా కల్మలచెరువు ఫీడర్ కింద 11కేవీ కరెంట్ స్తంభాలు మార్చుతున్నందున శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ సాయికృష్ణ తెలిపారు.

బాధితురాలి కుటుంబానికి ఆర్థికసాయం

గరిడేపల్లి : మండలంలోని సర్వారం గ్రామానికి చెందిన కొల్లి రాములమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం బాధితురాలి కుటుంబానికి శ్రీమంతులు సర్వారం వాట్సాప్ గ్రూప్ తరుపున బియ్యం, నిత్యావసర సరుకులకు గాను ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీమంతులు సర్వారం గ్రూప్ సభ్యులను గ్రామస్తులు అభినందించారు.

జైపాల్‌రెడ్డి జీవితం స్ఫూర్తిదాయకం

హుజూర్‌నగర్ : ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు గ్రహీత, కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్ రెడ్డి జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని డీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు మన్సూర్ అలీ అన్నారు. గురువారం జైపాల్‌రెడ్డి జయంతిని హుజూర్‌నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బిక్కన్ సాహెబ్, శంషుద్దీన్ సయ్యద్ అజ్మతుల్లా, జానిమియా, ఖాదర్, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మఠంపల్లి : మండలంలోని జామ్లాతండాకు చెందిన బోజ్యానాయక్‌కు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ రూ. 56 వేల చెక్కును గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా మంజీనాయక్ అందజేశారు. నాయకులు నవీన్‌నాయక్, భాస్కర్‌నాయక్, భీముడు నాయక్, ఖరీమ్, తులసీరాంనాయక్, మాజీసర్పంచ్ నాగునాయక్, రామారావు, బాలకృష్ణ, సుమన్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలి

- అదనపు కలెక్టర్ రాంబాబు



మునగాల: మాధవరంలో సర్వే వివరాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్



మునగాల : మాధవరంలో సర్వేను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఈఓ శిరీష



నడిగూడెం : బృందావనపురం వద్ద అధికారులకు సూచనలిస్తున్న ప్రత్యేక అధికారి సతీష్ కుమార్

హుజూర్‌నగర్ : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాల అమలు, నూతన రేషన్ కార్డుల మంజూరుపై ఆర్డీఓ శ్రీనివాస్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరి 26 నుంచి ఇందిరమ్మ ఇళ్లకు, నూతన రేషన్ కార్డులకు లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేశ్వర్, తహసీల్దార్ నాగార్జున రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి పరిశీలన వేగవంతం చేయాలి

మునగాల: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతుభరోసా పథకం అమలులో భాగంగా సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించే ప్రక్రియలో క్షేత్రస్థాయిలో పరిశీలన వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ పర్స రాంబాబు ఆదేశించారు. గురువారం మునగాల మండలం మాధవరంలో వ్యవసాయ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన సర్వేను తనిఖీ చేసి మాట్లాడారు. సర్వేలో ఎలాంటి తప్పులు చోటుచేసుకోకుండా 20వ తేదీలోగా పూర్తిచేయాలని కోరారు. సర్వే పరిశీలనలో ఎంపీడీఓ కె.రమేష్ దీనదయాళ్, తహసీల్దార్ వి.ఆంజనేయులు, మండల వ్యవసాయాధికారి బుంగా రాజు, వ్యవసాయ విస్తరణాధికారులు భవాని, నాగు, రమ్య, రేష్మ పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి సర్వే పరిశీలించిన డిప్యూటీ సీఈఓ

మునగాల : మండలంలోని మాధవరంలో రేషన్ కార్డులకు లబ్ధిదారుల ఎంపికపై సిబ్బంది నిర్వహించే క్షేత్రస్థాయి సర్వేను గురువారం జెడ్పీ డిప్యూటీ సీఈఓ బి.శిరీష పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ నూతన రేషన్‌కార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

నడిగూడెం : సాగుకు యోగ్యం కాని భూముల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా అటవీ శాఖ అధికారి పి.సతీష్ కుమార్ కోరారు. గురువారం నడిగూడెం మండలం బృందావనపురం వద్ద వ్యవసాయ శాఖ అధికారులు చేపట్టిన సర్వేను ఆయన పరిశీలించి అధికారులకు సూచనలిచ్చి మాట్లాడారు. ఎలాంటి తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ వి.సరిత, ఎంపీడీఓ సయ్యద్ ఇమామ్, మండల వ్యవసాయాధికారి రాయపు దేవప్రసాద్, ఎంపీఓ విజయలక్ష్మి, ఏపీఎం రామలక్ష్మి, ఏఈఓ ఉప్పయ్య, రైతులు ఉన్నారు.


ఇందిరమ్మ ఇళ్ల సూపర్ చెక్ పరిశీలన



గోండ్రియాలలో ఇందిరమ్మ ఇళ్ల సూపర్ చెక్‌ను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ అప్పారావు

అనంతగిరి : మండలంలోని గోండ్రియాల గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే సూపర్ చెక్‌ను గురువారం జెడ్పీ సీఈఓ అప్పారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాలను సిబ్బంది యాప్‌లో నమోదు చేశారని, ఆ వివరాలను అధికారులు మరోసారి పరిశీలిస్తున్నట్లు తెలిపారు. పారదర్శకంగా లబ్ధిదారులు ఎంపిక చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, ఎంపీడీఓ షేక్ సుష్మ, పంచాయతీ కార్యదర్శి వీర ప్రభాకర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

డ్రగ్స్ నివారణ ప్రతిఒక్కరి బాధ్యత



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐ రామకృష్ణారెడ్డి

నడిగూడెం : డ్రగ్స్ నివారణ ప్రతిఒక్కరి బాధ్యత అని మునగాల సీఐ రామకృష్ణారెడ్డి అన్నారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలనపై రూపొందించిన పోస్టర్‌ను గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. నేటి యువత మాదక ద్రవ్యాలు, గంజాయికి అలవాటై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. డ్రగ్స్, గంజాయి రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ జి.అజయ్‌కుమార్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాసాని రామకిషోర్, మండల కమిటీ సభ్యుడు జమ్మి యల్లయ్య, నాయకులు నోసిన అంజి, కాసాని రాంబాబు, దున్నా అభిమన్యుడు, నర్సయ్య, ఆంజనేయులు, జమ్మి వేణు, తదితరులు పాల్గొన్నారు.

లింగమంతుల గట్టు నూతన కమిటీ ఎన్నిక

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని అమరవరంలో గట్టు మీద ఉన్న లింగమంతులస్వామి, గంగమ్మ తల్లి ఆలయ చైర్మన్‌గా మద్దుల కృష్ణ, వైస్ చైర్మన్‌గా పిన్నబోయిన రమేష్, ప్రధాన కార్యదర్శిగా కలకుంట్ల నాగరాజును యాదవ కులస్తులు గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కర్నాటి వీరనాగిరెడ్డి, గ్రామపెద్దలు, యూత్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాకి లక్ష్మారెడ్డి ఆశయాలు సాధించాలి



రూ.50 వేల నగదు పురస్కారం అందజేస్తున్న కాకి లక్ష్మారెడ్డి కుటుంబసభ్యులు

హుజూర్‌నగర్‌రూరల్ : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కాకి లక్ష్మారెడ్డి ఆశయాలను సాధించాలని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల వేదిక హుజూర్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు మేకల నాగేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని అమర్‌నగర్‌లో నిర్వహించిన కాకి లక్ష్మారెడ్డి 6వ వర్ధంతి సభలో ఆయన పాల్గొని లక్ష్మారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. లక్ష్మారెడ్డి వర్ధంతి సందర్భంగా ప్రతి ఏడాది మాదిరిగా రూ. 50 వేల నగదు పురస్కారాన్ని 1993లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన దొబ్బల కాంతయ్య భార్య లతకు లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో విద్యావంతుల వేదిక రాష్ట్ర నాయకులు రాయపూడి చిన్ని, అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి, సీపీఐ జిల్లా నాయకులు కంబాల శ్రీనివాస్, పందిరి నాగిరెడ్డి, కాకి అజయ్, యడ్ల విజయ్, హరికిషన్, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు



కోదాడరూరల్ : వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్

కోదాడరూరల్ : వాహనదారులు మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్ అన్నారు. గురువారం కోదాడ పట్టణంలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. వాహనదారులు మద్యం సేవించి పట్టుపడితే జరిమానాతో పాటు జైలుకు పంపుతామని, వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సమ్మద్, సిబ్బంది ఉన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపవద్దు

మునగాల : మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఏఎస్ఐ కల్లు శ్రీనివాసరెడ్డి కోరారు. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా గురువారం మునగాల మండల కేంద్రంలోని గణపవరం క్రాస్ రోడ్డులో ఆటో డ్రైవర్లు, వాహనదారులకు అవగాహన కల్పించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆటో, ట్రాక్టరు డ్రైవర్లు, వాహనదారులు పాల్గొన్నారు.

జానకమ్మకు నివాళి



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

గరిడేపల్లి : స్వాతంత్ర్య సమరయోధురాలు, ప్రముఖ కమ్యూనిస్టు నాయకురాలు వేసాల జానకమ్మ మృతి సీపీఐకి తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని పొనుగోడు గ్రామంలో జానకమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో తన భర్త వేషాల రామస్వామికి అన్ని విధాలుగా తోడ్పాటు అందించారని అన్నారు. ఉద్యమకారులకు భోజన వసతి సౌకర్యం కల్పించి అండగా నిలబడిన వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు త్రిపురం సుధాకర్‌రెడ్డి, రైతు సంఘం రాష్ట్ర సమితి సభ్యుడు బిల్లా కనకయ్య, కుందూరు వెంకట్ రెడ్డి, ఆంజనేయులు, సత్యనారాయణ, పంగ సైదులు తదితరులు పాల్గొన్నారు.

జూలకంటి రంగారెడ్డి పరామర్శ

పాలకవీడు : మండల కేంద్రానికి చెందిన సీపీఎం నాయకుడు, మాజీ సర్పంచ్ మీసాల కాశయ్య ఇటీవల మృతి చెందారు. గురువారం కాశయ్య కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి పరామర్శించారు. కాశయ్య మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఆయన వెంట పార్టీ మండల కార్యదర్శి అనంత ప్రకాశ్, నగేష్, ధనమూర్తి, మల్లారెడ్డి, రాంరెడ్డి, యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా పోరాడాలి

మోతె : హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి మారపంగు రామాంజయ్య అన్నారు. గురువారం మోతె మండల కేంద్రంలో లక్ష డప్పులు, వెయ్యి గొంతుల కార్యక్రమ కళా జాతను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు, వెయ్యి గొంతుకల కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎంజెఎఫ్ అధికార ప్రతినిధి పల్లెల లక్ష్మణ్, కళాకారులు పల్లెల రాము, చిరంజీవి, నాగార్జున, బక్కయ్య, అంజి, ఉపేందర్, కృష్ణ, భారత్, తదితరులు పాల్గొన్నారు.